క్లుప్తంగా

నివాళి



జగన్నాథరెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్

తవణంపల్లి: జిల్లా రైతు సమాఖ్య నాయకుడు చెర్లోపల్లెకు చెందిన జగన్నాథరెడ్డి మృతికి పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డితో కలిసి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వివిధ పార్టీల నాయకులు, రైతు సమాఖ్య నాయకులు, రైతులు నివాళులర్పించారు.

ప్రైవేట్ క్లినిక్స్ తనిఖీ



నోటీసులు అందజేస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ఆర్‌ఎంపీలు తమ వద్దకు వచ్చే రోగులకు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య స్పష్టం చేశారు. గుడిపాలలో నిర్వహిస్తున్న పీఎంపీలు, ఆర్‌ఎంపీల క్లినిక్‌లను ఆమె పరిశీలించారు. క్లినిక్స్ నిర్వాహకులకు నోటీసులు అందజేసి మాట్లాడారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స చేసి రోగులను ప్రభుత్వ ఆస్పత్రులకు పంపాలన్నారు. అలా కాకుండా వారికి ఇంజెక్షన్ వేయడం, మందులు ఇవ్వడం, రక్త పరీక్షలు చేయడం లాంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, రుక్మిణి పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్(కాణిపాకం): పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు విధిగా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో మంగళవారం వ్యాధి నిరోధక టీకాలపై వైద్యాధికారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. పుట్టిన శిశువు మొదలుకుని దశల వారీగా వేసే వ్యాధి నిరోధక టీకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే నిర్ణీత సమయంలో టీకా వేసుకునే విధంగా చూడాలన్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ..పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ హనుమంతరావు, ఎస్ఓ జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



ఒంటరి ఏనుగు తొక్కి నాశనం చేసిన వరి పంట

ఐరాల: మండలంలో ఒంటరి ఏనుగు మళ్లీ విజృంభించింది. సోమవారం అర్ధరాత్రి వినాయకపురం గ్రామానికి చెందిన రైతు రవి వరి పంటను తొక్కి నాశనం చేసింది. అలాగే అపోలో వారికి చెందిన మామిడి చెట్లను విరిచేసి, రాతికూసాలను కూలదోసింది. సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఏనుగు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాప్తిపై అప్రమత్తంగా వ్యవహరించాల జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ సబ్‌యూనిట్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన సబ్ యూనిట్ అధికారులతో సమీక్షించారు. సీజనల్ వ్యాధుల కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు చర్యలు తీసుకోవాలని, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించాలన్నారు. ఫ్రైడే..డ్రైడేను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివిధ వేషధారణలో కళాకారులు

సాంస్కృతికం సమ్మోహనం

కాణిపాక వరసిద్ధుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆస్థాన మండపంలో ప్రదర్శించిన సాంస్కృత్రిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం కోదండరెడ్డి ధార్మికోపన్యాసం, మధ్యాహ్నం సుజాత, సుగుణ, విజయవాడకు చెందిన ఎస్.ప్రసాద్ భక్తిగీతాల ఆలాపన, సాయంత్రం తిరుపతికి చెందిన భాగవతారిణి సుమతి హరికథాగానం, చిత్తూరు చెందిన శాంత భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు సాగిన రేణిగుంట నటరాజ కళాక్షేత్రం, తిరుపతి గౌరీ నృత్యాలయ, శ్రీకాళహస్తి కళాకారుల కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు సమ్మోహితుల్ని చేశాయి. వెంకటగిరి శ్రీనటరాజ నాట్య మండలి పౌరాణిక నాటక ప్రదర్శన ఆహుతులను కట్టిపడేశాయి. కోలాటాలు, లంబాడీ నృత్యాలు అదుర్స్ అనిపించాయి. అనంతరం అధికారులు కళాకారులను సత్కరించారు. - కాణిపాకం







నృత్యప్రదర్శనలో కళాకారులు



భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకుల బృందం

బాబు ఇంటి కోసం.. బెజవాడను ముంచేశారు

- వరదలపై ముందస్తు సమాచారం ఉన్నా ప్రజలకు చెప్పని ప్రభుత్వం
- సహాయ చర్యల్లో ప్రభుత్వం విఫలం
- చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి విమర్శ



విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: కేవలం చంద్రబాబు నాయుడు తన ఇంటిని వరదల నుంచి కాపాడుకోవడానికే.. విజయవాడను నట్టేట ముంచేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంసి. విజయానందరెడ్డి దుయ్యబట్టారు. విజయవాడ వరదలపై మంగళవారం విజయానందరెడ్డి స్పందించారు. బెజవాడకు వరద ముప్పు ఉందని ప్రభుత్వానికి ముందే తెలిసినా ప్రజల్ని అప్రమత్తం చేసిన పాపానపోలేదన్నారు. కరకట్టమీదుగా వెళ్లాల్సిన బుడమేరు నీటిని చంద్రబాబు నాయుడు ఇంటిని కాపాడడానికి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలపైకి వదిలేసి, ప్రాణాలు తీశారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలంటే ఏమాత్రం లెక్కలేదన్నారు. 2015లో జరిగిన గోదావరి పుష్కరాల్లో ప్రచార పిచ్చి కోసం చంద్రబాబు షూటింగ్ చేయించి 29 మంది మృతికి కారణమైన విషయాన్ని ప్రజలు మరువలేదన్నారు.

ఇప్పుడు విజయవాడ వరదల్లో 50 మందికి పైగా మృతికి ముమ్మాటికీ టీడీపీనే కారణమన్నారు. వరద విలయానికి ప్రాణాలు, సర్వం కోల్పోయిన కుటుంబాలు, బాధితులకు బాధితులకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వం సహాయక చర్యల్లో ఘోరంగా విఫలమైందని ఎండగట్టారు. పైగా వరదలకు ప్రతిపక్షమే కారణమంటూ నిందలు మోపడం కూటమి ప్రభుత్వానికి ఎంత వరకు సమంజసమో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తప్పిదంపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఇకనైనా బాధితులకు అండగా నిలబడాలన్నారు.

గణితం అంటే భయం వద్దు



అరుణశివప్రసాద్‌ను సత్కరిస్తున్న కణ్ణన్ పూర్వ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : గణితం అంటే విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని గణిత అవధాని, జేవీవీ ఉపాధ్యక్షులు అరుణశివప్రసాద్ అన్నారు. మంగళవారం కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గణిత మ్యాజిక్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో గణితంపై భయాన్ని పోగొట్టేందుకు ఇలాంటి మ్యాజిక్ షోలు ఎంతో ఉపయోగపడుతాయంటూ.. గణితంలో తార్కిక ఆలోచనలను పెంపొందించే అంశాలను మ్యాజిక్ షోలో ఆయన తెలియశారు. పుట్టిన తేదీలపై అనుకున్న సంఖ్యలను తెలియజేయడం, సంకలనాల్లో మొట్టమొదటే మొత్తాన్ని తెలియజేయడం, స్పెల్లింగ్స్‌తో సంఖ్య కార్డులను యాదృచ్ఛికంగా తీయడం.. తదితర అంశాలను మ్యాజిక్ రూపంలో విద్యార్థులకు ఆసక్తి కలిగించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షు లు పూల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రతి ఏటా సెప్టెంబర్ 12న కణ్ణన్ జయంతి నిర్వహిస్తామ న్నారు. ఇందులో భాగంగానే విద్యార్థుల కోసం మ్యాజిక్ షో ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అరుణశివప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తులసిబాబు, పూర్వవిద్యార్థులు మునిరత్నం, మురళి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బంగారుపాళెం: బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వాణీశ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రాజెక్టు పరిధిలోని బంగారుపాళెం మండలం రామరాజుపురం మినీ అంగన్‌వాడీ వర్కర్(ఎస్సీ), యాదమరి మండలం రసూల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్(మైనారిటీ), బంగారుపాళెం మండలంలోని బండ్లదొడ్డి(ఓసీ), తుంబకుప్పం దళితవాడ (ఎస్సీ), నలగాంపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్(ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 21వతే ది సాయంత్రం లోపు అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చిత్తూరు పరిధిలో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు రూరల్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి తెలిపారు. చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని కుర్రపల్లెలో మినీ అంగన్‌వాడీ (ఓసీ), వడ్డి గుడిసెలులో సహాయకులు (బీసీ-ఏ), గుడిపాలలోని శ్రీరంగపల్లెలో సహాయకులు పోస్టులు ఉన్నాయన్నారు. అర్హత, ఆసక్తి ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు కొంగారెడ్డిపల్లె ఐటీఐ సమీపంలోని తమ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

ఐరాల ఐసీడీఎస్ పరిధిలో..

తవణంపల్లె: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐరాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి నిర్మల తెలిపారు. నల్లిశెట్టిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ (జనరల్ కేటగిరీ), వీర్లగుడిపల్లె, కారకాంపల్లెల్లో హెల్పర్ (జనరల్ కేటగిరీ), సంతపల్లెలో వర్కర్ పోస్టు(ఎస్సీ కేటగిరీ) పోస్టులు ఖాళీగా ఉన్న ట్లు సీడీపీఓ తెలిపారు. స్థానికులై పదో తరగతి పాసై 21 నుంచి 35 ఏళ్లలోపు మహిళలు అర్హులని, 12వ తేదీ నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ లోపు ఐరాల సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత



ప్రజా సమస్యలు ఆలకిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో «ప్రజా సమస్యల పరిష్కార వేదిక» నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. వాటిపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఫిర్యాదులపై క్షేత్ర పరిశీలన చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇదే సమయంలో గతంలో అందిన వినతులు, కలెక్టరేట్‌లో అందిన ఫిర్యాదులకు సంబంధించి పరిష్కారంపై చర్చించారు. కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రులహక్కు



చిత్తూరులో రాస్తారోకో చేస్తున్న కమ్యూనిస్టు నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ ఆపాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరులో జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద రాస్తారోకో చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు నాయకలు నాగరాజన్, గిరిధర్ గుప్త, సురేంద్రన్, గంగారాజు,ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మునిరత్నం నాయుడు ,ఏఐటీయూసీ నాయకులు రఘు, మురళి , సంతోష్, సీఐటీయూ నాయకులు రమాదేవి, చిట్టెమ్మ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి విజయ గౌరి, నగర అధ్యక్షురాలు కుమారి , మహిళా నాయకులు కవిత , కోమల తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులే పడక గది..!



తరగతి గదులలో నిద్రిస్తున్న విద్యార్థులు

సదుం: మండలంలోని మహాత్మా జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఇటీవలే జూనియర్ కళాశాలను ప్రారంభించారు. పాఠశాలలో 480 మంది, జూనియర్ కళాశాలలో 111 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల మాత్రం ఉన్నప్పుడు విద్యార్థులకు వసతి సౌకర్యాలు సరిపోయేవి. జూనియర్ కళాశాల ప్రారంభించడంతో డార్మెటరీ గదులే లేక తరగతి గదులలోనే నిద్రిస్తున్నారు. బాత్రూమ్, టాయిలెట్ గదుల కొరత వేధిస్తోంది. వంటగది, డైనింగ్ హాల్ సామర్థ్యం సరిపోకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. వసతుల కోసం 40 డార్మెటరీ గదులు, 30 మరుగుదొడ్లు, 30 బాత్‌రూంలు, కిచెన్, డైనింగ్ హాల్ అదనంగా నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇకడ ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న పాఠశాలలో ప్రతి ఏటా పదవ తరగతిలో వందశాతం ఫలితాలను సాధిస్తున్నారు. క్రీడలలోను ప్రతిభ చాటి పతకాలను సాధిస్తున్నారు. ఈ పాఠశాలలో సీటు కోసం పోటీ తీవ్రంగా ఉంది. ఉన్నతాధికారులు ఇక్కడి సమస్యలపై దృష్టి సారించి వసతుల కల్పనకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరద బాధితులకు విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న బాస్ అసోసియేషన్ సభ్యులు



ఎమ్మెల్యేకు నగదు అందచేస్తున్న బస్సు ఆపరేటర్ల నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడ వరద బాధితులకు తమ వంతు సహాయంగా పలువురు విరాళమిచ్చారు. మంగళవారం బోర్డ్ ఆఫ్ యాన్‌స్రెస్టాల్ అండ్ ఆల్టర్‌నేటివ్ మెడికల్ సైన్సెస్ (బాస్) ఆధ్వర్యంలో రూ.74,657 చెక్కును కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు రవి, అంజాద్, కిశోర్, భాస్కర్ పాల్గొన్నారు. అలాగే నగరంలోని విజ్ఞానసుధ విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్ రూ.85,345 ల చెక్కును ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌కు అందజేశారు.

ప్రైవేటు బస్సు ఆపరేటర్ల సాయం..

చిత్తూరు అర్బన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం చిత్తూరులోని ప్రైవేటు బస్సు ఆపరేటర్ల అసోసియేషన్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడును కలిసిన రూ.2 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సీఎంటీ త్యాగరాజన్, ఎల్‌జీబీ తిరుకుమరన్ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి గ్రామ సభలు

తవణంపల్లె: మండలంలోని 32 పంచాయతీల్లో వికసిత్ ఆంధ్ర- 2047 కార్యక్రమం నిర్వహణపై 11 నుంచి 13వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఆయా పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు.

రేషన్ బియ్యం పట్టివేత

గంగవరం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గంగవరం పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. చిత్తూరు నుంచి బెంగళూరుకు మహీంద్రా పికప్ వాహనంలో ఖాళీ టమాట క్రేట్ల మధ్యలో రేషన్ బియ్యం బస్తాలు వేసుకుని అక్రమంగా తరలిస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో చిన్నూరు ఫ్లైఓవర్ వద్ద వాహనాన్ని అడ్డుకుని, తనిఖీ చేయగా 50 బస్తాల రేషన్ బియ్యం ఉండగా గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ జిలానీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇళ్ల వద్దకే 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



తవణంపల్లె: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సంధ్య

తవణంపల్లె: గ్రామీణులు అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఇళ్ల వద్దకే వైద్యసేవలు అందివ్వడం «ఫ్యామిలీ డాక్టర్» ఉద్దేశమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు కేశవ నారాయణ, వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని సరకల్లు, కె.పట్నంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. గర్భవతులు రక్తహీనత బారిన పడకుండా తాజా ఆకుకూరలు, పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పాపసముద్రంలో..

గుడిపాల: మండలంలోని పాపసముద్రంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు గుడిపాల వైద్యాధికారి సంధ్య వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకే వెళ్లి వైద్యసేవలు అందించారు. వైద్య సిబ్బంది విజయ, సోనియా, బుజ్జమ్మ, చంద్రశేఖర్, ప్రభావతి, రుక్మిణమ్మ పాల్గొన్నారు.